ISSN 0971-278X

# ప్రజాసాహితి

## సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సృజనకు విత్తు స్వంత భాష

ఫిబ్రవరి 2013
వెల : రు. 20/-



రచనకు సత్తువ ప్రజల భాష

356

కథలు : సిహెచ్. మధు, నూకాచారి
ధారావాహిక : డా॥ ఆర్కే రచన -మానవ పరిణామం
వ్యాసాలు : వకుళాభరణం, దేవరాజు మహారాజు, భూపాల్

# ప్రియమైన నాగరికులారా!

ఉర్దూమూలం : సాహిర్ లూధియానీ

**ఈ** రక్తం మనదికానీ వారిదవనీ
యావత్తు మానవజాతీ నెత్తుటి ముద్దవుతుంది.

ఈ యుద్ధం తూర్పున జరుగుతోందో
పడమరన సాగుతోందో
ప్రశాంత పృధివంతా రక్తసిక్తమవుతుంది

మన యింటిపైనో సరిహద్దుల్లోనో
బాంబులు ఎక్కడ కురిసినా
నిర్మాణస్ఫూర్తి గాయపడుతుంది

తగులబడ్డ పంటపొలాలు మనవో వారివో
జీవనమే ఆకలితో అలమటిస్తుంది

యుద్ధ శకటాలు ముందుకు వెళ్ళనీ వెనక్కు మళ్ళనీ
గొప్ప సంగతేం కాదు
తల్లి భూదేవి ఒడి మాత్రం బంజరునేలవుతుంది

అది విజయోత్సవమో ఓటమి శోకమో ఏదైతేనేం
బతికున్నవారు మరణించిన యోధులకు నివాళులివ్వాల్సిందే

అందుకే ఓ నాగరిక ప్రజలారా
యుద్ధాన్ని వాయిదా వేయటమే మంచిది

మీ, మా యిండ్లల్లో
దీపాలు కునకకుండా మినుకుతూండటమే మంచిది

ఫిబ్రవరి 2004 ప్రజాసాహితి నుండి పునర్ముద్రణ
*(మెయిన్ స్ట్రీం 2003 డిసెంబరు ప్రత్యేక సంచిక నుండి అనువాదం-దివికుమార్)*

---

# అసత్య మతం

– రవీంద్రనాథ్‌ఠాగూర్

**ప్రభూ,** నీవు నాస్తికుడినైనా కరుణిస్తావు
హేతువాదజ్యోతిని వెలిగించి, దాన్ని గౌరవిస్తూ
మతాల పేరుతో డంబాలు పలకకుండా, పురాణాలకు పూజలు చేయకుండా
మానవునిలోని మంచికి మాత్రమే మాన్యతనిచ్చే నాస్తికుడినైనా కరుణిస్తావు
కాని, విశ్వాసం నెపంతో భ్రమను కౌగిలించుకుంటున్న హంతకులు, హతులు
నిర్హేతుక నమ్మకాలతో తీర్పులు తీరుస్తూ
తమ మతం కాని వాళ్లను
నరికివేసే ఈ ద్విపాద పశువులు
రక్తసిక్త వస్త్రాలను ఆలయంలో ధ్వజాలుగా ఎగరేస్తూ, ఆనందిస్తూ
అందులోని దయ్యాన్ని దేవుడని ఆరాధించే వీరు వాళ్ల మతానికే కళంకం
మానవత్వానికి తలవంపులుగా తరతరాలుగా సాగుతున్న ఈ అమానుషాలు
దేవాలయ ప్రాంగణాల ఆశ్రయం కోరగా వీళ్లు వాటిని చెరసాలలుగా మార్చేశారు
అదిగో, ప్రళయకాల ప్రభంజనం వినిపిస్తోంది నాకు
కాలం తన చీపురుకట్టతో మలినాలన్నిటినీ ఊడ్చి వేయడానికి సాగి వస్తుంది
ఆ ప్రళయ తరంగాలలో ప్రపంచమంతా మునిగిపోతుంటే
స్వేచ్ఛగా ఉండవలసిన ప్రాణులను ఆయుధాలుగా చేసిన వీళ్లు
అనంతప్రేమకు అవరోధాలుగా చెరసాల గోడలు కట్టిన వీళ్లు
ప్రపంచమంతా మునిగిపోతుంటే చిల్లుల దోనెలో నదిని దాటాలని ప్రయత్నిస్తున్నారు
వీళ్ల హీనస్థితికి ఎవరిని నిందించగలరు
ఓ ప్రభూ, ఈ తప్పుడు మతాన్ని ఛిన్నాభిన్నం చేయి. ఈ అంధులను కాపాడు
రక్తపుటేరులలో కరుళ్లు కట్టిన ఈ పూజామందిరాన్ని పునాదితో సహా పగలగొట్టు
ఈ అసత్యమత చెరసాలలో ఒక పెనుపిడుగు పడవేయ్
ఈ విషాదసీమకొక జ్ఞానదీపం అందించు దేవా!

1930 ప్రాంతంలో ప్రచురించబడిన రవీంద్రనాథ్ ఠాగూర్ కవితను
అరవిందబోస్ **ఫాల్స్ రెలిజిన్**గా చేసిన ఆంగ్లానువాదంకు...

– తెలుగు: పెద్ది సాంబశివరావు

సంపాదకీయం - 1

# "భారతీయ టెర్రరిస్టులు"

**ఇప్పటిదాకా** మీరు అవినీతిపరులంటే కాదు 'మీరే' అని పరస్పరారోపణలతో పాలకవర్గ రాజకీయ ప్రధాన ముఠాలు రెండూ దెప్పుకోవటమనేది చూశాం. అవినీతిని మూటగట్టుకున్నందువల్ల భాజపా అధినేత నితిన్ గడ్కారీ తన అధ్యక్ష పదవిని కోల్పోవటంతో అవినీతి నిందలకాలం దాదాపు ముగిసిందనుకోవచ్చు. అవినీతి తమకు అంటరానిదిగా రుజువు పరుచుకోవాల్సిన దురవస్థలో కాంగ్రెసు పాలకులు ఎప్పుడూ లేరు. తామే కాదు తమ ప్రత్యర్థి పాలక ముఠాలుకూడా అవినీతిలో ఆరితేరినవేనని ప్రజలు భావించేట్లు చేసే కృషిలో వారు విజయం సాధించినట్లే! అయినా దేశంలో పెచ్చరిల్లిన ఆర్థిక సంక్షోభం, అసమానత్వాల ఫలితంగా ప్రజలలో పేరుకుపోయిన అసంతృప్తి వల్ల, జీవన స్థితిగతులను మరింత దిగజారకుండా వుండటానికి ప్రజలు తీవ్ర ఆందోళన పడుతున్నారు. కాంగ్రెసుకు అధికార సాధనలో ప్రధాన పోటీదారుగావున్న భా.జ.పా.కు పై పరిస్థితి అనుకూలించకుండా చేయటానికి కాంగ్రెసువారికి మరొక సరికొత్త ఆరోపణల ఆయుధం అవసరమయింది. అదే "టెర్రరిజం"!!

ఇటీవల రాజస్థాన్ రాజధాని జైపూర్లో జరిగిన కాంగ్రెసు "చింతనా శిబిరం"లో దేశ ఆంతరంగిక శాఖామంత్రి సుశీల్కుమార్ షిండే 'ఆరెస్సెస్', 'బిజెపి' లను హిందూ టెర్రరిజాన్ని పోషిస్తున్న వారుగా బహిరంగంగా ఆరోపించటంతో భారతీయ టెర్రరిజం గురించిన చర్చ అధికారికంగా మొదలయిందనుకోవచ్చు. అవినీతిని దేశద్రోహంగా, ప్రజాద్రోహంగా పరిగణించని పాలకులు టెర్రరిజాన్ని ఇంకా అలా భావించే స్థితికి చేరలేదు. పై శిబిరంనుండే ఎన్నుకోబడిన అధికారిక యువనాయకుడుగా దేశం ముందుకు రాబోతున్న రాహుల్గాంధీ తన తండ్రి రాజీవు, నాయనమ్మలు ఇందిరలు 'సిక్కు' 'ఎల్.టి.టి.ఇ.' టెర్రరిజాల్ని పాలుపోసి పెంచిన దుష్ఫలితంగా అర్థాంతరంగా హతులై పోయారనికాక వారు దేశంకోసం త్యాగంచేసిన 'వీర దేశభక్తులు'గా ప్రజలు పరిగణించాలని ఆశిస్తున్నాడు. కానీ 1984 నవంబరులో ఢిల్లీ మహానగరంలో సిక్కులపై సాగించిన ఊచకోత- 4000 సిక్కు కుటుంబాలను బలితీసుకున్న సంఘటన- జరిగి 30 ఏళ్ళవుతున్నా దేశం యింకా మరిచిపోలేదని కాంగ్రెసు పాలకులకు తెలియనిదేమీ కాదు. సిక్కుల హక్కుల సంఘమొకటి రెండు రోజులక్రితం భారత ప్రభుత్వ పట్టణాభివృద్ధిశాఖామంత్రి కమలనాథ్పై- 1984 నాటి హత్యాకాండను పథకం ప్రకారం కుట్రపన్ని ప్రేరేపించినవానిగా ఆరోపిస్తూ సిట్జర్లాండ్ అటార్నీ జనరల్ కోర్టులో కేసును దాఖలా చేసింది. ('హిందూ' 25-1-2013)

గత 22 ఏళ్ళుగా అమెరికా నాయకత్వాన పెద్దఎత్తున అమలుజరుగుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణమనే ఆర్థిక విధానాలకి, ముస్లిం్ద్వేష కేంద్రంగా అమలుజరుపుతున్న "టెర్రరిజంపై పోరు" అనే రాజకీయం జతకలిసి వుందనేది వాస్తవం. అందుకు భారత పాలక ముఠాలు తరతమ స్థాయిలో చేతులు కలిపి అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే విషయం బహిరంగ రహస్యమే! తమ కంటె భాజపా ఈ విషయంలో ప్రత్యక్ష చర్యలద్వారా సంబంధం కలిగివున్నదనే వాస్తవాన్ని తమ కుమ్ములాటలో భాగంగా అధికారికంగా బహిర్గతపరచటానికి కాంగ్రెసువారు నేటికి సంసిద్ధులైనారు. షిండేనే చెప్పినట్లు ఇప్పటికే పత్రికలద్వారా నమ్మదగిన సంఘటనలు కొన్నీ; గట్టిగా అనుమానించ దగినవి మరికొన్నీ వెలువడుతూనే వున్నాయి.

'ప్రజాసాహితి' 2000 ఆగస్టు సంచికలో **"మత విద్వేష కుట్రలను ఖండించండి! బాంబు పేలుళ్ళపై న్యాయవిచారణ కోరండి"** అనే సంపాదకీయం రాసింది. ఆ సంవత్సరం మే-జులై నెలల మధ్య మచిలీపట్నం చర్చిలో, బెజవాడ కృష్ణలంక రామాలయంలో, గుంటూరు మసీదులో ఇంకా ఒంగోలు, తాడేపల్లిగూడెం, నిజామాబాద్, మెదక్జిల్లాలలో, వికారాబాద్లో బాంబుపేలుళ్ళు జరిగాయి. రాజమండ్రిలో క్రిస్టియన్ల స్మశానంలో మృతుల చిహ్నాలను ధ్వంసంచేశారు. ఈ సంఘటనల పేరుతో అనేకమంది ముస్లిము యువకులను అరెస్టుచేసి కేసులు బనాయించారు. (ఇద్దరు ఆరెస్సెస్ కార్యకర్తలను కూడా అరెస్టు చేసినట్లు 'ఈనాడు' పత్రిక రాసింది). ఇదంతా ఒక పథకం ప్రకారం మత విద్వేష వాతావరణాన్ని వ్యాప్తిచేయటానికి పన్నిన కుట్రగా భావించి ఈ సంఘటనలపై న్యాయవిచారణ జరిపించాలని 'ప్రజాసాహితి' 13 సం॥ల క్రితమే కోరింది.

తర్వాత కాలంలో జరిగిన సంఝౌతా ఎక్స్ప్రెస్లో, హైదరాబాదు మక్కామసీదులో, అజ్మీర్ దర్గాలో నాందేడ్లో జరిగిన బాంబు పేలుడు ఘటనలన్నీ 'ముస్లిం టెర్రరిస్టులు' చేసినవిగా భావించి అనేకమంది ముస్లిము యువకులను చిత్రహింసల పాలుచేశారు. కానీ మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలెగావ్లో జరిగిన మోటార్బైక్లో పెట్టిన బాంబుపేలుడు సంఘటన (2008 సెప్టెంబరు) తర్వాతగానీ అది హిందూత్వ సంస్థలయిన అభినవభారత్; విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ తదితర సంస్థలకు చెందినవారు జరిపిన చర్యలుగా పోలీసులు పసిగట్టలేదు. పైన పేర్కొన్న మాలెగావ్ బాంబుపేలుడు దగ్గరనుంచి సంఝౌతా ఎక్స్ప్రెస్, అజ్మీరు దర్గాకేసు, మక్కామసీదులో ప్రార్థనా సమయంలో పేలుళ్ళు జరిపినది-పై సంస్థలకు చెందినవారుగా ఆధారాలతోసహా దొరకపుచ్చుకున్న ఐ.పి.ఎస్. అధికారి పేరు హేమంత్ కర్కారే, చాలా ఆశ్చర్యంగా. టెర్రరిస్టు వ్యతిరేక దళం (యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్) కు చెందిన ఈ పోలీసు అధికారి కర్కారే, ముంబాయి బాంబుదాడుల సంఘటనగా పేరుగాంచిన(26-11-2008) 'టెర్రరిస్టు' దాడులలో మరణించాడు. మాలెగావ్ సంఘటన తర్వాత సరిగ్గా 2 నెలలకే ముంబాయి దాడి జరిగింది. మీడియా అంతా ముంబాయి దాడిని (26/11) తాజ్హోటల్పై దాడిగానే ఎక్కువ ప్రచారంచేసి చూపించారుగానీ, కర్కారే అసలు తాజ్హోటల్ వైపుకే వెళ్ళలేదు. తమ ప్రచారం బలంతో మీడియా కొన్ని వాస్తవాలను తొక్కిపట్టాయి. కొన్నిటినే పదేపదే చెప్పాయి.

ముంబాయి తాజ్‌హోటల్‌నుండి నారిమన్ ప్రాంతందాకా జరిగిన దాడులూ, ఛత్రపతి శివాజీ రైల్ టెర్మినల్ నుండి కామా హాస్పిటల్ దాకా జరిగిన దాడులూ వేర్వేరు ప్రాంతాల్లో జరిగినవే కాక ఏకకాలంలో వేర్వేరు 'టెర్రరిస్టు' బృందాలు జరిపినవిగా వున్నాయి. అక్కడ అమెరికన్లు, యూదులూ, ఒక ఫ్రాన్స్ దేశస్తుడూ హతులు కాగా రైల్వేస్టేషన్ ప్రాంతంలో జరిగిన వాటిలో చనిపోయిన 52 మంది భారతీయులలో ఆరుగురు పోలీసులు. మిగిలిన 46లో 22 మంది ముస్లిములు. భారతీయుల్ని చంపినవారు మరాఠీ భాషే మాట్లాడినట్లు సాక్ష్యాలున్నాయి.

టెర్రరిస్టులకు మతం వుండదు కనుక హిందూ టెర్రరిస్టులనే పదం వాడటమే దురుద్దేశ పూరితమైనదిగా సంఘపరివార్ ప్రతినిధులంటున్నారు. నిజమే! మాలెగావ్ ఘటనల వాస్తవాలు బయట ప్రజానీకానికి తెలియక ముందువరకూ వీరు ముస్లిం టెర్రరిస్టులనే పదాన్ని విపరీతంగా వాడటమేకాక ముస్లిములంటేనే టెర్రరిస్టులనే భావం వ్యాప్తిచెందేటట్లు (అమెరికా ప్రభుత్వంలాగా) ప్రచారం కావించిన సంగతి లోక విదితమే. నిజానికి ప్రజలు ఏ మతస్తులైనా వారు మతోన్మాదులూ, పరమతద్వేషులూ కారు. ఇతరేతర ప్రయోజనాలు ముఖ్యంగా రాజకీయ ప్రయోజనాలకోసం మతాన్ని ఆయుధంగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహించేవారిని ఆయా మతస్తులుగా గుర్తించటం ఆ మత ప్రజలను అవమానించటం, అనుమానించటం కూడా అవుతుంది.

**ప్రజారాజకీయ దృష్టితో ఆలోచించినప్పుడు మైనారిటీ మతోన్మాదం మైనారిటీ మతస్తుల పాలిట భస్మాసుర హస్తంలాంటిది. ఎందుకంటే అది మెజారిటీ మతోన్మాదం పెంపొందేట్లు రెచ్చగొడుతుంది (అక్బరుద్దీన్ ఓవైసీ ప్రసంగంలాగా). మెజారిటీ మతోన్మాదం దీర్ఘకాలికంగా దేశ ప్రజలందరికీ తక్షణంగా మైనారిటీ మతస్తుల భద్రతకు చాలా ప్రమాదకారిగా వుంటుంది. ఇదీ భారత ఉపఖండ చరిత్రనుండి నేర్చుకోవాల్సిన లౌకికసారం.**

భారతీయ హిందూ-ముస్లిములు ఐక్యంగా వుంటే తమ దోపిడీ ప్రయోజనాలు సాగవని ఏనాడో బ్రిటీషు సామ్రాజ్యవాదులు గ్రహించి తగినన్ని మతోన్మాద, మత విద్వేష బీజాలు నాటిగానీ దేశాన్నుండి తెరవెనక్కి తప్పుకోలేదు. ఇప్పుడు అమెరికా సామ్రాజ్యవాద ప్రభువులు తమ అంతర్జాతీయ (ముఖ్యంగా గల్ఫ్) వ్యూహంలో భాగంగా, భారతదేశంలోపలా సరిహద్దులవెంటా నిరంతర మత విద్వేషాల 'యుద్ధ' వాతావరణం వుండేట్లుగా వ్యూహాలు రచించుకున్నారు. ముస్లిములవల్లా, పాకిస్తానువల్లా భారతదేశం అభద్రతలో చిక్కుకుని వుందని మెజారిటీ హిందువులను నమ్మించటానికి నిరంతర మత ఉద్రిక్తతలను విద్వేషాలను సృష్టించటం భాజపా దీర్ఘకాలంగా అనుసరించి అమలు చేస్తున్న రాజకీయ వ్యూహం. వారు ప్రతి మత సమస్యనూ రాజకీయ సమస్యగా ప్రతి రాజకీయ సమస్యనూ మత సమస్యగా మార్చాలనే సిద్ధాంతానికి భౌతిక రూపం కల్పించే శుద్ధ ఆచరణవాదులే కాని భగద్భక్తితో, ఆరాధనలతో రాజకీయాధికారాన్ని పొందగలుగుతామనే ఊహాజనిత అలౌకికవాదులూ, ఆధ్యాత్మిక జీవులూ కారు. భాజపేయులు 'కన్యాశుల్కం' నాటకంలో అగ్నిహోత్రావధాన్లులాంటి వారయితే, కాంగ్రెసు వారు గిరీశం ముక్కునుండి ఊడిపడ్డ శుద్ధ స్వార్ధ ప్రయోజనవాదులు. వీరు సామ్రాజ్యవాద ప్రపంచీకరణలోనే దేశాభివృద్ధి వుందని జనాల్ని బురిడీ కొట్టించగలరు. కుల-మత-ప్రాంతీయ విద్వేషాలనన్నిటినీ ప్రజల్ని పక్కదారి పట్టించడానికీ, తమ ఓట్లు, సీట్లకింద మలుచుకోడానికీ వినియోగ పెట్టుకోగలరు.

రాజకీయ సంక్షోభం ముంచుకు వస్తున్నపుడు భారత పాలక ముఠాలు ముఖ్యంగా కాంగ్రెసు, భాజాపాలు విద్వేషాలనూ, మతోన్మాదాలను రెచ్చగొట్టటంలో తమ తమ పద్ధతులలో దిగజారుడు పోటీకి తలపడుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నాయి కనుక వారికి సాధారణ రాజకీయ పద్ధతులు సరిపోనప్పుడు తమ 'పోటీ'దార్ల రహస్య మూలాలనుకూడా బయటికి లాగక తప్పని స్థితిలో పడతారు. అందులో భాగంగానే బహుశా ఇక జరగబోయే చర్చనీయాంశం 'భారతీయ టెర్రరిస్టులంటే ఎవరు;' హేమంత్ కర్కారే(ఐ.పి.ఎస్)ను చంపిందెవరు?

**- 25-1-2013**

# సంపాదకీయం - 2 జీవనరంగాల పొదుగుకోసి- పాలకవర్గాల పబ్బం

**"చట్టం తప్పుతుంది. మతం తప్పుతుంది**
**ప్రభుత్వం తప్పుతుంది. న్యాయం తప్పుతుంది**
**కానీ బతుకు తప్పదు. బతక్క తప్పదు"** అన్నారు కాళోజీ.

మన జేబుల్ని 'సర్‌ర్'న కోసే కరెంటు ఛార్జీల చావుదెబ్బల్ని తట్టుకుంటూ-ఆర్టీసీ ఛార్జీల బాదుడికీ, రైలుఛార్జీల గూబమోతకీ, భూరిజిస్ట్రేషన్ల ఫీజుల పెనుదాడికీ, డీజిల్ వాయింపుకీ, పెట్రోలు మంటలకీ, రైల్వే సరుకుల రవాణా ఛార్జీల పిడిగుద్దులకీ, వంటనూనె తంటాలకీ, గ్యాస్‌బండకింద నుజ్జుకావడానికీ కార్పొరేట్ విద్యాలయాల బందిపోటు చర్యలను భరిస్తూ; కార్పొరేట్ వైద్యం పోట్లను సహిస్తూ నిరంతరం సిద్ధపడుతున్న ప్రజాసామాన్యం బతుకు చివికి చివికి చితుకులైపోతోంది.

ఒక్కవైపు కొద్దిమంది దగ్గర డబ్బుమేటలు మేటలుగా పోగు పడుతోంది. మరోవైపు కోట్లాదిమంది డబ్బులేమి-ఆకలాకలిగా లుంగలు చుట్టుకుపోతోంది. అభివృద్ధి అందలమెక్కి సామాన్యుని సంసారంలో అల్లకల్లోలం సృష్టిస్తోంది. అభ్యుదయం శకలాలు శకలాలుగా చీలిక పీలికలవుతోంది. సమస్త జీవన రంగాల పొదుగుకోసేస్తున్న దేశంలో ప్రజాస్వామిక పాలన వుందా? అనే చిరు సందేహం కూడా రాకుండా చేస్తున్నారు పరిపాలకులు. గత 15-20

రోజుల వార్త పత్రికల్ని పోగేసి చూస్తే ప్రజానీకంపై సంక్షోభం తీవ్రత చీకట్లో చుక్కల్లా స్పష్టంగా కనిపిస్తుంది. 'అమ్మబోతే అడివి-కొనబోతే కొరివి' అన్నచందంగా కష్టజీవుల స్థితి మహాదారుణంగావుంది.
***ఛాయరాజ్*** అన్నట్టు-

***"యంత్రక వీపుపెంకున/గీసుకున్న గ్రాఫులో***
***పడిపోయిన ధాన్యం రేటు/బారుగీత్తై బంగారం రంగులతో***
***అందని మెరుపు మెరుస్తోంది/...బుగతతో కయ్యం***
***దప్పదన్నట్టుంది/యారకాడుతో వియ్యం తప్పుతున్నట్టుంది"***

ప్రజల్ని ఎప్పుడూ ఒక ఆనందంలోనో (ప్రపంచ తెలుగు మహాసభలు) ఉన్మాదంలోనో (పాకిస్తాన్ సరిహద్దు విద్వేషాలు, అక్బరుద్దీన్ ఒవైసీ ప్రసంగం) దుఃఖంలోనో (ఢిల్లీ 'నిర్భయ' దుర్ఘటన) ముంచితే ప్రజలు ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించరు అంటాడు చాణక్యుడు.

అపర చాణక్యులు ఏలుతున్న దేశం మనది!

అయితే వర్తమాన దేశం పరిస్థితి ఎలావుంది?

రైతుని ఆత్మహత్యల పాడెక్కించింది ప్రపంచీకరణ.
చేతివృత్తులకి ప్రత్యామ్నాయం చూపకుండా పాతిపెట్టింది,
ప్రపంచం పెద్దబజారు.
కుటీర పరిశ్రమల్ని విద్యుదాఘాతాలతో ముడిసరుకుల
సంక్షోభంతో ఆకలిచావులకు బలిపెట్టింది,
బహుళజాతి బానకడుపు.
మన కళ్లల్లో శ్వేతభవనం కలల్ని పండించింది,
ఆర్థిక సామ్రాజ్యవాదం.
మన కళ్ళకి డాలర్‌గవ్వల్ని శాసించింది,
సాంస్కృతిక సామ్రాజ్యవాదం.
మన రాజ్యాంగానికి దిక్సూచి అయ్యింది,
ఆధిపత్య అమెరికా సామ్రాజ్యవాదం.
వెరసి ఓ పెద్ద 'మానవ కబేళా'
భారతదేశ ముఖచిత్రమై దాపురించింది.
గాయాలమీద వాతలు పెట్టినట్లు
జీవన రంగాలన్నీ దారుణంగా కుదేలవుతున్నా
ప్రభుత్వ పాలన నిమ్మకు నీరెత్తినట్లుంది.

ప్రపంచ ధరల సూచీతో పోల్చుకుంటే భారత్‌లో ధరలు చాలా తక్కువేననీ అందుకోసం వాటితో సమానం చేయాల్సివుందనీ అందుకు ప్రజలు సిద్ధంగా వుండాలనీ శ్రీరంగనీతులు చెప్తున్నారు, దేశప్రధాని!

ప్రపంచవ్యాప్తంగా వున్న జీవన స్థితిగతులతో, జాతీయ ఉత్పత్తితో, జీవన వ్యయంతో సరిపోల్చుకొనే శాస్త్రీయ దృక్పథాన్ని మరుగుపరచి ఇలాంటి బాధ్యతా రహితమైన ప్రకటనలు చేస్తున్నారన్నది గ్రహించాలి! మోసపూరితంగా-రాయితీపై 6 గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ప్రకటించి, ఓటుబ్యాంకు డిపాజిట్లకోసం వాటిని ఉదారంగా 9 సిలెండర్లకు పెంచుతున్నామని ఫోజుకొట్టినట్లే కొట్టి, సిలెండర్‌పై సంవత్సరానికి వందరూపాయల చొప్పున పెంచుకుపోవడానికి వ్యూహం తయారైపోయింది.

పెట్రోలు ధరను సం॥నికి రూ41/- చొప్పున పెంచుకుపోయే ప్రణాళికతో పాలకులు సిద్ధంగా వున్నారు.

నీలం తుపాను దెబ్బతో విదేశాలనుంచి నౌకల రాకపోకలు సక్రమంగా జరగకపోవడం పేరుతో వంటనూనె (పామాయిల్) ధరలు భగ్గుమనిపిస్తున్నారు.

పల్లెనుంచి ఢిల్లీవరకు-ఉల్లినుండి బంగారంవరకు ఏదీ అందుబాటులోలేని సంక్షోభం తీవ్రత-చుట్టుతిరిగి ప్రజల మెడలకే చుట్టేస్తున్నారు. 65 సం॥ల సొతంత్రం ఈనగాచి నక్కల పాలయింది. శ్రష్టుప్రియాలతో ఎన్నికల బరిలో రెచ్చిపోతూ శూన్య హస్తాలతో గద్దెలెక్కి వెక్కిరిస్తున్న పాలకవర్గాలు ఇవాళ ఓటు రాజకీయ వ్యాపారంలో దివాలాకోరు పద్ధతిలో చేయితిరిగిన ఘటికులు.

156 ఏళ్ళ భారత స్వాతంత్ర్య పోరాట సంఘర్షణ ఈనాటికీ ముగిసిపోలేదు…అందుకే!

జాతీయోద్యమాన్ని దారిమళ్ళించి తెచ్చిన ప్రజాస్వామ్యం, కుహనా విలువలతో దళారీ బూర్జువా పదవీ వ్యాపారాన్ని మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరింపచేస్తోంది.

శ్రామికుల సంఘటిత శక్తితో నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తిచేసుకోవాల్సిన పరిస్థితులు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఏ వూరిలో పండినపంట ఆ వూరిలో సరిపడినంత తీసుకోగా, మిగిలింది బయటకి పంపే పంపిణీ వ్యవస్థగానీ- ఆరకంగా ప్రజాతంత్ర ప్రణాళికతో ఆహారోత్పత్తిని సాధించే జాతీయ వ్యవసాయ విధానంగానీ, వేలం వెర్రి విలాస, వినోదాలకోసం కాక ప్రజల నిత్యజీవితావసరాల కోసం మన కాళ్ళపై ఆధారపడి అభివృద్ధి పరుచుకునే పారిశ్రామిక వ్యవస్థగానీ నూతన ప్రజాతంత్ర విప్లవమే సాధించగలదు. పరిపాలన ప్రజా ప్రయోజనాల కొరకే అయినప్పుడు ధరలు కూడా అందుబాటులోకి వస్తాయి.

అటువంటి ప్రజాప్రభుత్వాన్ని స్థాపించుకోడానికి, నేపథ్యంగా-సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ప్రజాతంత్ర భావజాల వ్యాప్తి ఇంకా ఇంకా బలంగా జరగాల్సివుంది.

సంపదలు కొందరు తిని-అందరికీ అందకుండాచేసే రాజకీయవ్యవస్థ వుండకూడదు. అందుకోసం భావజాల రంగంలో సంఘర్షణకోసం ప్రజా కవులూ, రచయితలూ, ప్రజాతంత్ర మేధావులూ, కష్టజీవులూ సంఘటిత పడాల్సిన కూడలిలో నిలబడివున్నాం!

బతుకంటే పోరాటం! పోరాడితేనే చలనం. చలనమంటే పరిణామం. పరిమాణాత్మక పరిణామం గుణాత్మక పరిణామాన్ని సంతరించుకొనేట్లు అక్షరాలు రాపిడిపడుతూనే వుండాలి. ప్రజాసాహిత్యం-ప్రజాసంస్కృతీ భావజాలరంగాన్ని భౌతికశక్తిగా పదునెక్కించడానికి ఈ తరహా పురిటినొప్పులు పడుతూనే వుంటాయి!!!

**- 26-1-2013** ✤

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1456**

* * *

**Read other issues of Praja Sahiti Magazine@**

**http://kinige.com/kbrowse.php?via=author&id=58**